# రైతుల కష్టాలు పట్టించుకోకుండా మాజీ మంత్రిపై విమర్శలా..

**● ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి అసమర్థ పాలనకు ఇదే నిదర్శనం**





**మిడ్జిల్, మే 10, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
యాసంగిలో రైతులు పండించిన మొక్కజొన్న పంటను కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైతుల సమస్యలు పరిష్కరించకుండా మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పై విమర్శలు చేయడం ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి చేతగానితనానికి నిదర్శనమని మిడ్జిల్ మండల బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. ఆదివారంరోజు మిడ్జిల్ మండల కేంద్రంలో జిల్లా నాయకులు సుధా బాల్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. జడ్చర్ల పత్తి మార్కెట్ యార్డ్ వద్ద దాదాపు 30 రోజులుగా మొక్కజొన్న రైతులు పడిగాపులు కాస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు. విసుగు చెందిన రైతులు నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పాల్గొని రైతుల సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి, రైతులకు భరోసా కల్పించి ధర్నా విరమింపజేశారని పేర్కొన్నారు.
అయితే దీనిని ఓర్చుకోలేక ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మాజీ మంత్రి పై అడ్డగోలు విమర్శలు చేయడం అవివేకానికి నిదర్శనమన్నారు. నిజంగా రైతులపై ప్రేమ ఉంటే కొనుగోలు కేంద్రాలను ఎందుకు పరిశీలించడం లేదని ప్రశ్నించారు. మూడు నియోజకవర్గాల మక్కలు జడ్చర్లలో కొనుగోలు అవుతున్న విషయం కూడా తెలియకపోవడం ఎమ్మెల్యే అసమర్థతకే నిదర్శనమని విమర్శించారు. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పై ఆరోపణలు చేస్తూ కాలక్షేపం చేయడం మానేసి ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టాలని సూచించారు. మూడు సంవత్సరాలుగా అవినీతి, భూకబ్జాల ఆరోపణలు చేస్తున్నప్పటికీ ఒక్కటి కూడా నిరూపించలేకపోయారని విమర్శించారు. రైతుల సమస్యలను పట్టించుకోకుండా దిగజారుడు వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని, మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు సుధా బాల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పాండు యాదవ్, మాజీ ఎంపీపీ సుదర్శన్, జంగారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, గోపాల్ ముదిరాజ్, కాడయ్య, గంజి కృష్ణ, నామిని శ్రీనివాసులు భీమ్ రాజ్, కరుణాకర్ రెడ్డి, సుకుమార్, నవీన్ చారి, రాఘవేందర్, భాస్కర్ చారి, టౌన్ అధ్యక్షులు జగన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సారా తయారీ ముడి పదార్థాల స్వాధీనం



**ఆమనగల్లు,మే10(నేటి దర్శిని):**
ఆమనగల్లు ఎక్సైజ్ స్టేషన్ అధికారులు కడ్తాల్ టోల్ ప్లాజా దగ్గర నిర్వహించిన వాహనాల తనిఖీల్లో భాగంగా భారీగా నల్లబెల్లం, పటిక స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ నుంచి వివిధ గ్రామాలకు సారా తయారి కోసం ముడి పదార్థాలను తరలిస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు చేపట్టగా కారులో 750 కిలోల నల్ల బెల్లం,80 కిలోల పటిక స్వాధీనం చేసుకున్నారు.2 ఫోన్లు, వాహనాన్ని సీజ్ చేసి వారిని అరెస్టు చేసినట్లు సీఐ బద్యనాథ్ చౌహాన్ తెలిపారు.

# ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభకు తరలిన బిజెపి శ్రేణులు..




**ఆమనగల్లు,మే10(నేటి దర్శిని):**
ఆమనగల్లు మున్సిపాలిటీ బిజెపి నాయకులు హైదరాబాదులోని పరేడ్ గ్రౌండ్స్ సికింద్రాబాద్ లో ప్రధాని మోడీ నిర్వహించే భారీ బహిరంగ సభకు ఆదివారం బిజెపి నాయకులు,కార్యకర్తలు తరలి వెళ్లారు. ప్రధాని మోడీ రూ:1695 కోట్లతో పీఎం మిత్ర కాకతీయ మెగా టెక్స్ టైల్స్ పార్క్, అలాగే రూ; 6000 కోట్లకు పైగా పెట్టుబడులతో పలు అభివృద్ధి పనుల కొరకు జరిగే బహిరంగ సభకు బిజెపి పార్టీ ముఖ్య నాయకులు, సభను విజయవంతం చేయడానికి తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎర్రవోలు మహేష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ భీమనపల్లి దుర్గయ్య, మాజీ కౌన్సిలర్లు చెన్నకేశవులు,గోరటి నరసింహ,బిజెపి సీనియర్ నాయకులు జానయ్య,బ్రహ్మం, లండం చంద్రయ్య, పార్టీ కార్యకర్తలు తదితరులు భారీ బహిరంగ సభకు తరలి వెళ్లారు.

# ఘనంగా బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి జన్మదిన వేడుకలు






**మిడ్జిల్ , మే 10, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
జడ్చర్ల నియోజకవర్గం లోని ఉర్కొండ మండలంలోని బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్చర్ల నియోజకవర్గంలోని వివిధ మండల గ్రామాల ప్రాంతానికి చెందిన బిజెపి సీనియర్ నాయకులు, సర్పంచులు జిల్లా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై ముచ్చర్ల జనార్దన్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి ఆనందోత్సాహాల మధ్య వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. రాబోయే జడ్చర్ల నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి అభ్యర్థిగా ముచ్చర్ల జనార్దన్ రెడ్డి బరిలో నిలవనున్నారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుండే నాయకుడిగా ఆయనకు స్థానిక ప్రజలలో మంచి ఆదరణ ఉందన్నారు. యువత, మహిళలు, కార్మిక వర్గాలకు అండగా నిలుస్తూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్నారని పేర్కొన్నారు. జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఈ కార్యక్రమంలో స్థానిక బిజెపి జిల్లా నాయకులు, మహిళా నాయకులు, యువజన విభాగం సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని జనార్దన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఇచ్చిన మాటను మరోసారి నిలబెట్టుకున్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి



**మిడ్జిల్, మే 10, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
సర్పంచ్ ఎన్నికలు మరియు మున్సిపాలిటీ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే స్వంత నిధులతో హైమాస్ లైట్స్ ఇప్పిస్తానని మాట ఇచ్చిన బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి , ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ1. ఆత్మకూర్ మున్సిపాలిటీలోని 6 వ వార్డు అభ్యర్థిగా బీజేపీ తరపున పోటీచేసిన పుల్లరి భరత్ గారి తరపున ప్రచారం చేసిన బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి భరత్ ని కౌన్సిలర్ గా గెలిపిస్తే స్వంత నిధులతో హైమాస్ లైట్ ఇప్పిస్తానని మాట ఇచ్చారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ 6 వ వార్డులో హైమాస్ లైట్ ఇప్పించడం జరిగింది. ఉట్కూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామ సర్పంచ్ గా నర్సిమ్మని గెలిపించినందుకు బీజేపీ సీనియర్ నాయకులు ఉట్కూర్ భాస్కర్ కోరికమేరకు నిన్న కొత్తపల్లి గ్రామంలో హైమాస్ లైట్ ఫిట్టింగ్ చేయించారు.3. తరువాత మక్తల్ మండలంలోని ఉప్పర్ పల్లి గ్రామంలో నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి బలరాంరెడ్డ కోరికమేరకు నిన్న హైమాస్ లైట్ ఏపించిన బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి కి అభినందనలు తెలిపిన ఆయా గ్రామస్థులు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ స్వంత నిధులతో మూడు మండలాల్లో నూతనంగా అమర్చిన ఆకాశదీపాలను త్వరలోనే బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని బీజేపీ నాయకులు తెలిపారు.

# ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండగా సర్పంచ్ రజిత..

**● పెళ్లి భారమవ్వకూడదనే లక్ష్యంతో ఆర్థిక సాయం అందిస్తున్న తేనెపల్లి తండ సర్పంచ్**

**● సామాజిక బాధ్యతలో ముందున్న తేనెపల్లి తండ సర్పంచ్ రజిత జవహర్ లాల్**



**గుర్రంపోడు, మే 10 (నేటి దర్శిని):**
పేద కుటుంబాల ఆడబిడ్డల పెళ్లిళ్లు భారంగా మారకూడదనే ఉద్దేశంతో తేనెపల్లి తండ సర్పంచ్ రజిత జవహర్ లాల్ చేపడుతున్న "గ్రామ కళ్యాణం" కార్యక్రమం గ్రామ ప్రజల ప్రశంసలు అందుకుంటోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు గ్రామంలో జరిగే ప్రతి వివాహానికి తన వంతు సహాయాన్ని అందిస్తూ ఆమె ఆదర్శ సర్పంచ్‌గా నిలుస్తున్నారు. ఈ క్రమంలో తేనెపల్లి తండకు చెందిన వాడిత్యా లచ్చిరామ్ కుమార్తె వివాహ వేడుకకు సర్పంచ్ రజిత జవహర్ లాల్ స్వయంగా హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. అనంతరం "గ్రామ కళ్యాణం" పథకం కింద రూ.5,016 నగదు ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలోని పేద కుటుంబాలు తమ పిల్లల పెళ్లిళ్ల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనకూడదనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం తన బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములై సేవా భావంతో పనిచేస్తున్న సర్పంచ్ రజిత జవహర్ లాల్ చొరవ అభినందనీయమని కొనియాడారు. అభివృద్ధి పనులతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం గ్రామానికి గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, వార్డు సభ్యులు, యువకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర సమరయోధులకు ఘన నివాళులు..



**మందమర్రి మే 10: (నేటి దర్శిని):**
మందమర్రి పట్టణంలోని మాజీ ఆర్మీ జవాన్ ప్రస్తుత ఎస్.డపిసి ఉద్యోగి రాజేష్ పీవ్ హల్,రాణి పీవ్ హల్, దంపతులు ఆదివారం తన నివాసంలో 1857 సిపాయిల తిరుగుబాటు (ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం) ప్రాణాలు అర్పించిన స్వాతంత్ర సమరయోధులను స్మరించుకొని ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..భారతదేశ చరిత్రలో ఒక మరుపురాని అధ్యాయం.బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా, ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన వీరుల ధైర్య సాహసాలను స్మరించుకోవడం మన బాధ్యత.1857 తిరుగుబాటు10 మే 1857న మీరట్‌లో సిపాయిలు బ్రిటిష్ అధికారులకు వ్యతిరేకంగా తిరుగుబాటు ప్రారంభించారు.ఇది దేశవ్యాప్తంగా వ్యాపించింది.మంగళ్ పాండే (తొలి తిరుగుబాటుదారుడు), రాణి లక్ష్మీబాయి, బహదూర్ షా జఫర్, నానా సాహెబ్,తాంతియా తోపే,కున్వర్ సింగ్ వంటి నాయకులు బ్రిటిష్ వారికి ఎదురొడ్డి నిలిచారు.బ్రిటిష్ వారి అణచివేత, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా భారతీయ సిపాయిలు తమ ఆత్మగౌరవం కోసం చేసిన పోరాటం ఇది.ఈ తిరుగుబాటు బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనకు ముగింపు పలికింది. తరువాతి తరాలకు స్వాతంత్ర్య భారతదేశ స్వేచ్ఛ కోసం ప్రాణాలర్పించిన వారి త్యాగనిరతి చిరస్మరణీయని వారి త్యాగాలను కొనియాడారు.

RNI NO: TGTEL/25/A0471 | తెలుగు దిన పత్రిక | సత్య శోధనే మా లక్ష్యం



హైదరాబాదులోని పరేడ్ గ్రౌండ్స్ సికింద్రాబాద్ లో ప్రధాని మోడీ నిర్వహించే భారీ బహిరంగ సభకు ఆదివారం రోజు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా.బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి బిజెపి నాయకులు,కార్యకర్తలు తరలి వెళ్లారు.
(నేటి దర్శిని ప్రతినిధి) (మిడ్జిల్)

# బీఆర్ఎస్వి ఆధ్వర్యంలో బండి సంజయ్ దిష్టిబొమ్మ దగ్ధం

- మైనర్ బాలికకు న్యాయం చేయాలంటూ నిరసన
- భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని బీఆర్ఎస్వి డిమాండ్
- నకిరేకల్‌లో బండి సంజయ్‌కు వ్యతిరేకంగా బీఆర్ఎస్వి ఆందోళన



**నకిరేకల్, మే 10 (నేటి దర్శిని):** మైనర్ బాలికపై జరిగిన ఘటనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్వి ఆధ్వర్యంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మైనర్ బాలికపై అత్యాచారం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. తప్పు చేసిన తన కుమారుడిని రక్షించేందుకు బండి సంజయ్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కుమ్మక్కై కేసును నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. నైతిక బాధ్యత వహిస్తూ బండి సంజయ్ తన మంత్రి పదవికి వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. బాధితురాలికి పూర్తి స్థాయిలో న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ గాదే శివ, బీఆర్ఎస్ జిల్లా నాయకులు చింతమల వెంకటేష్, కందికంటి నాగేంద్రబాబు, టీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు జిల్లా సంపత్ కుమార్, బీఆర్ఎస్వి నియోజకవర్గ నాయకులు జిల్లా సందీప్, మండల నాయకులు యాతకుల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.




# అక్షర విప్లవ వీరుడు మహాత్మా పూలే ఆశయాలతో 'బీసీ కవిత భేరి'

**హైదరాబాద్, మే 10(నేటి దర్శిని):** తెలుగు భాషా చైతన్య సమితి ఆధ్వర్యంలో, నక్క వెంకటమ్మ యాదవ్ - నక్క యాదగిరి స్వామి యాదవ్ స్పోర్ట్స్ ఫౌండేషన్, తెలంగాణ సాహిత్య అకాడమీ, క్లాస్‌మేట్స్ క్లబ్ సౌజన్యంతో మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో "బీసీ కవిత భేరి" సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సభ సమన్వయకర్తలుగా డాక్టర్ పెబ్బేటి మల్లికార్జున్, పి. బడే సాబ్ వ్యవహరించగా, ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ సాహిత్యం కాలానుగుణంగా తన స్వరూపాన్ని మార్చుకుంటూ సమాజ చైతన్యానికి శక్తివంతమైన సాధనంగా మారిందన్నారు. ఒకప్పుడు కవిత్వం కేవలం రసానందం, ప్రకృతి వర్ణనలకే పరిమితమై ఉండేదని, ఆధునిక కాలంలో అది సామాజిక బాధ్యతను మోసే ఆయుధంగా పరిణమించిందని పేర్కొన్నారు.

ప్రస్తుత సమాజంలో అసమానతలు, అన్యాయాలు, అవినీతి వంటి సమస్యలపై సాహిత్యం ప్రశ్నిస్తోందని, రచయిత తన కలం ద్వారా సమాజంలోని కుళ్లును కడిగిపారేయడానికి ప్రయత్నిస్తున్నాడని అన్నారు.





"కలం కత్తి కన్నా గొప్పది" అనే నానుడి సాహిత్య ప్రభావాన్ని ప్రతిబింబిస్తుందని వ్యాఖ్యానించారు. జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే వంటి మహనీయుల ఆలోచనలను నేటి తరం రచయితలు సాహిత్యం ద్వారా ప్రజలకు చేరువ చేస్తున్నారని తెలిపారు. దీని ద్వారా యువతలో విద్య, హక్కులు, సామాజిక చైతన్యంపై అవగాహన పెరుగుతోందన్నారు. సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ బీసీలు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. అస్తిత్వ వేదన, ఆత్మగౌరవం బీసీ ఉద్యమాలకు ప్రధాన ఆధారాలని, అన్ని బీసీ కులాలు, ఉపకులాలు ఐక్యంగా ముందుకు వస్తే రాజకీయ సాధికారత సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. 'బీసీ కవిత భేరి' వంటి కార్యక్రమాలు పూలే ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, శాసనమండలి మాజీ చైర్మన్ ఎల్.పీ. మధుసూదనాచారి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్ టి. చిరంజీవులు, బీసీ సమాజం అధ్యక్షుడు సూర్యారావు, ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ పూర్ణచంద్రరావు, డాక్టర్ విజయ్ కుమార్, తెలుగు భాషా చైతన్య సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ కల్లేష్, డాక్టర్ జయప్రకాష్, గురునాథం, డాక్టర్ వీరేష్, కవి సమ్మేళనం నిర్వహకురాలు డాక్టర్ రాధాకుసుమ తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత షుగర్ క్యాంప్




**నిడమనూరు, మే10 (నేటి దర్శిని):** నిడమనూరు మండల కేంద్రంలోని బొడ్రాయి బజారు వద్ద ప్రతి ఆదివారం ఉచిత షుగర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ నిడమనూరు అధ్యక్షులు బెల్దే అశోక్, కార్యదర్శి చిత్రం అశోక్, కోశాధికారి లంక బ్రాహ్మణ తెలిపారు. మండలంలోని నిరుపేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ ఉచిత షుగర్ పరీక్షల శిబిరాన్ని నిర్వహిస్తున్నామని వారు పేర్కొన్నారు. ప్రతి ఆదివారం జరిగే ఈ క్యాంప్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ పేద ప్రజలకు అందుబాటులో ఉండి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని వారు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు, ముందస్తు జాగ్రత్తల ద్వారా వ్యాధులను నియంత్రించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు.

# పుచ్చ పండు పై మాతృమూర్తి చిత్రం..వేసిన చిత్రకారుడు




**(నేటి దర్శిని): ఎల్బీనగర్,** పుచ్చ పండు పై మాతృమూర్తి చిత్రం.. ఆదివారం ప్రపంచ మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎల్బీనగర్ కు చెందిన ప్రముఖ చిత్రకారుడు మరియు కార్టూనిస్టు నాగార్జునపు రాము తన చిత్రకళ నైపుణ్యంతో వినూత్నంగా పుచ్చపండు పై బ్రెడ్ తో కత్తిరించి తల్లి బిడ్డల చిత్రాన్ని అద్భుతంగా రూపొందించి మాతృ దినోత్సవ శు భాకాంక్షలు తెలియజేశారు చిత్రాన్ని చూసిన ప్రతి ఒక్కరూ రాముని అభినందించారు

# మదర్స్ డే సందర్భంగా పాలు పండ్లు పంపిణీ చేసిన శివలీల ఫౌండేషన్





**నల్గొండ,మే10 (నేటి దర్శిని):** మదర్స్ డే సందర్భంగా న్యూ కంబాల శివలీల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ శివలీల ఆధ్వర్యంలో నల్లగొండ బస్ స్టాండ్ ఆవరణలో, ప్రభుత్వ ఆసుపత్రిలో మజ్జిగ, పండ్ల పంపిణీ, బ్రెడ్ ప్యాకెట్ల పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ కంబాల శివలీల మాట్లాడుతూ పురిటి నొప్పులు భరించి తన ప్రాణాన్ని పణంగా పెట్టి జన్మనిచ్చిన కన్న తల్లిదండ్రులని వృద్ధాశ్రమాలలో వదిలిపెట్టకుండా మన ఇళ్లలో పెట్టుకొని కంటికి రెప్పలా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలు ఆంబోతు కుమార్, మౌనిక, సుంకరి కవిత, మురళి, సుంకరి లక్ష్మమ్మ, నక్క సూర్య కళ, మద్రి శ్వేత, భాస్కర్ , రజిత, స్వరూప ఈ కార్యక్రమానికి సహకరించి పాల్గొన్నారు.

# అమ్మ ప్రేమకు సాటి లేదు.. మాతృమూర్తుల త్యాగాలు చిరస్మరణీయం

- బిడ్డల భవిష్యత్తే అమ్మల కల..వారి ఆనందమే తల్లుల నిజమైన సంతోషం
- మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి

**మిడ్జిల్,మే 10, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** అమ్మ..ఒక పదం కాదు, ఒక ప్రపంచం. మన జీవితంలో తొలి గురువు, తొలి స్నేహితురాలు, తొలి దేవత కూడా అమ్మే. ఆమె ప్రేమలో స్వార్థం ఉండదు, ఆమె చూపులో మమకారం తప్ప మరొకటి ఉండదు. బిడ్డల సంతోషం కోసం తన సుఖాలను త్యాగం చేస్తూ, వారి భవిష్యత్తు బాగుండాలని ప్రతి క్షణం ఆరాటపడేది తల్లే. అమ్మ ప్రేమే మన మొదటి ఆశ్రయం కాగా, ఆమె ఆశీర్వాదమే మన జీవితానికి నిజమైన బలం. దేవుడు ప్రతి చోట ఉండలేక తన ప్రతినిధిగా తల్లిని ఈ భూమిపై పంపాడని పెద్దలు చెప్పిన మాట అక్షరాలా నిజం. బిడ్డల ఎదుగుదల కోసం ఎన్నో కష్టాలు భరిస్తూ, వారి విజయాల్లోనే తమ



మాతృమూర్తి తో ఆశీర్వాదం తీసుకుంటున్న ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి

ఆనందాన్ని చూసుకునే తల్లుల సేవలు ఎప్పటికీ మరువలేనివి. మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి తల్లులందరికీ హృదయపూర్వక శు భాకాంక్షలు తెలిపారు. సమాజ నిర్మాణంలో తల్లుల పాత్ర అత్యంత కీలకమని, మంచి విలువలు కలిగిన తరాలను తీర్చిదిద్దేది అమ్మ ప్రేమ, సంస్కారాలేనని ఆయన పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తూ, ఎలాంటి పరిస్థితులలోనైనా బిడ్డల కోసం అహర్నిశలు శ్రమించే తల్లులు నిజమైన మహానుభావులని అన్నారు. తల్లుల త్యాగాలు, ప్రేమ, ఆప్యాయతలకు ప్రతిఫలం ఇవ్వడం సాధ్యం కాదని, వారిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. అంతులేని మమకారాన్ని పంచే ప్రతి తల్లికి, కుటుంబ బంధాలను ప్రేమతో కాపాడే ప్రతి మాతృమూర్తికి మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, తల్లుల ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

